# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-06-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.
2. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు.
3. ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సహాయపడుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
4. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి పేర్కొన్నారు.
5. దేశంలో చేపట్టనున్న జన గణనకు సంబంధించి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ రోజు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

==========================

వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని కేంద్రమంత్రి ఈరోజు దర్శించుకున్నారు. ఆలయం వద్ద కేంద్రమంత్రికి తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బి.ఆర్.నాయుడు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి విశాఖ చేరుకున్నారు. అనంతరం బీచ్‌రోడ్డులో చేపడుతున్న జాతీయ స్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు పరిశీలిస్తారు. అనంతరం యోగా దినోత్సవంపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారు.

--------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీకాకుళం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో యోగా కార్యక్రమాలు ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. నంద్యాలలోని మార్కెట్‌యార్డులో జరిగిన యోగా

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజ కుమారి  పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

-----------------------------

యోగా ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండలో కియా పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఈరోజు ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 21.. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగా ప్రచార కార్యక్రమాలను నెలరోజులపాటు అన్ని జిల్లాల్లో నిర్వహిస్తోందని  వివరించారు.

-----------------------------

ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో సహాయపడుతోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ముఖ్యమంత్రి సహాయనిధి– సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి ఈ రోజు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాలకొల్లులో ఆర్థిక సహాయం కింద 92 మందికి చెక్కులు అందించామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివరించారు.

-----------------------------

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి పేర్కొన్నారు. ఎన్డీఏ 11 ఏళ్ల పాలనపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆమె పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ..  అమరావతిని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేయడానికి కొత్త రైల్వే లైన్ కింద 2 వేల 250 కోట్ల రూపాయలు కేటాయించి శంకుస్థాపన చేశారన్నారు. అమరావతి బాహ్య వలయ రహదారికి 20 వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఆమె పేర్కొంటూ..

వాయిస్...35 సెకన్లు

-----------------------------

దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జన గణనకు సంబంధించి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈరోజు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన. రెండు దశల్లో జరిగే ఈ గణన 2027 మార్చి 1వ తేదీ నాటికి పూర్తి కానుంది. ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, ఒక 1 కోటి 34 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. డేటా భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర హోంశాఖ వెల్లడించింది.

-----------------------------

నెల్లూరులో వచ్చే నెల 6వ తేదీ నుంచి జరగనున్న రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. రొట్టెల పండుగ ఏర్పాట్లపై నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. నెల్లూరు బారా

షహీద్ దర్గాలో  భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 25 వేల మంది ప్రార్థనలు చేసేలా మందిరాన్ని నిర్మిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ..

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

తిరుపతిలో ఆటోలకు డిజిటలైజేషన్ స్టిక్కర్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. క్యూఆర్ కోడ్ డిజిటల్ స్టిక్కర్స్ విధానాన్ని  తిరుపతిలో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులతో ఆటో డ్రైవర్లు  దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని స్టిక్కర్స్ విధానం ప్రారంభించామని వీటి ద్వారా ఆటోల సమాచారం సులువుగా తెలుసుకోవచ్చని తెలిపారు.

---------------------------

ప్రముఖ పత్రికా సంపాదకులు, స్వాతంత్ర్య సమరయోధులు ఖాసా సుబ్బారావు వర్థంతి ఈరోజు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొన్న ఆయన 1896 జనవరి 23వ తేదీన నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు. స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొన్న సుబ్బారావు టంగుటూరి ప్రకాశం పంతులు స్థాపించిన స్వరాజ్య దినపత్రికలో ఉపసంపాదకులుగా సేవలందించి అనంతరం “స్వతంత్ర” అనే తెలుగు వారపత్రికను ప్రారంభించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించారు. గొప్ప సంపాదకుడు, అంతకుమించిన మానవతావాది అయిన ఖాసా సుబ్బారావు 1961 జూన్ 16వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...22 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పరీక్ష కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షల తేదీలలో  మార్పు చేస్తున్నట్లు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా  ఈ నెల 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో జరగవలసిన  పరీక్షలను వచ్చే నెల 1,2 తేదీల్లో నిర్వహిస్తామని చెప్పారు. యోగ దినోత్సవం సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని వారి రాకపోకలకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో ఈ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు తెలిపారు.

=====================